## రామోజీరావు సేవలు చిరస్మరణీయం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 14 : రామోజీరావు పత్రికా రంగానికి, తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులైన శైలజ, వసుంధరను పరామర్శించారు.

## సర్కారుబడికి ఎస్సై కుమారుడు



ఎస్సై రాణి కుమారుడిని బడిలో చేర్చుకుంటున్న జిల్లాసమగ్ర శిక్ష అధికారులు

పాలమూరు, జూన్ 14 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రామయ్యబౌళి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ కాలనీకి చెందిన రాణి తమ కుమారుడు కె.విరాట్‌నందను 3వ తరగతిలో చేర్పించేందుకు ముందుకొచ్చారు. జిల్లా సమగ్రశిక్ష అధికారుల సమక్షంలో రామయ్యబౌళి ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చేసి అందుకు సంబంధించిన అడ్మిషన్ పత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాధికారులు మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగం చేస్తూ తమ కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగమణి, హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు శిరీష, అర్చన పాల్గొన్నారు.

## కబడ్డీలో నల్లగొండ జట్టు విజేత

- ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

బొడ్రాయిబజార్, జూన్ 14 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల క్రీడలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీలో మొదటి బహుమతి నల్లగొండ ఆపరేషన్ సర్కిల్, ద్వితీయ బహుమతి మహబుబ్‌నగర్ ఆపరేషన్ సర్కిల్, తృతీయ బహుమతి వరంగల్ సర్కిల్ గెలుచుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు అధికారులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఎస్‌ఈ సీహెచ్ పాల్‌రాజ్, డీఈలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న ఖాకీలు

- ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు
- దాయాదుల దాడిలో ఒకరు.. బెదిరింపులతో మరొకరు..
- న్యాయవాదికి అయిజ ఎస్సై బెదిరింపులు
- ఉట్కూర్ ఎస్సైని సస్పెండ్ చేసిన మల్టీజోన్ ఐజీ

మహబూబ్‌నగర్, జూన్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీఎం సొంత జిల్లాలో ఖాకీలు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు. చిన్నచిన్న ఫిర్యాదులను అడ్డం పెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులే అన్యాయానికి గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సివిల్ కేసుల్లో తల దూర్చడం.. బాధితులని బెదిరించడం పరిపాటిగా మారింది. నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం పెద్దపొర్ల గ్రామంలో భూతగాదాల్లో సంజీవ్(28)ను నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా దాయాదులైన కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు కర్రలతో దాడికి దిగారు. చుట్టుపక్కల వారు వారిస్తున్నా విచక్షణా రహితంగా కొట్టారు. 100కు డయల్ చేసి రక్షించాలని కోరినా పోలీసులు స్పందించకపోవడంతో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఇదే జిల్లాలో మరో ఘటనలో పోలీసుల వేధింపులు భరించలేక ఓ రైతు, బీజేపీ కార్యకర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలో సివిల్ తగాదాల్లో పోలీసులు తల దూర్చడంతో ప్రశ్నించిన న్యాయవాదిని బెదిరించడంతో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. ఈ మూడు సంఘటనలు శుక్రవారం ఒకేరోజు ఉమ్మడి పాలమూరు జిల్లాలో సంచలనం సృష్టించాయి. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎస్సై సస్పెండ్‌కు గురయ్యారు. ఉట్కూరు ఎస్సై శ్రీనివాసులును సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే రోజులో పోలీసుల నిర్లక్ష్యం, బెదిరింపులు, సివిల్ పంచాయితీలో తలదూర్చడం వంటి ఘటనలు కలకలం రేపాయి.

### నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

నారాయణపేట జిల్లా ఉట్కూర్ పీఎస్‌లో భూవివాదంలో తమ దాయాదుల నుంచి ప్రాణభయం ఉన్నదని, రక్షణ కల్పించాలని పది రోజుల కిందటే బీజేపీ కార్యకర్త, రైతు సంజీవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడి జరిగిన సమయంలోనూ 100కు డయల్ చేసినా ఎస్సై శ్రీనివాస్ పట్టించుకోలేదని అతడి బంధువులు ఆరోపించారు. అయితే దాడి చేసిన వారు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని మృతుడి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పోలీసులు స్పందించి ఉంటే నిండు ప్రాణం దక్కేదని అతడి కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



గ్రామంలో గస్తీ కాస్తున్న పోలీసులు

**సీఎం ఇలాఖాలో లా అండ్ ఆర్డర్ అట్టర్‌ఫ్లాప్**

### బెదిరింపులతో మరొకరు

నారాయణపేట జిల్లాలో మరో ఘటనలో బెదిరింపులతో మరో రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై కురుమయ్య బెదిరింపులతో భయపడి మున్నూరు శేఖర్ రెడ్డి అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్వ మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని నిలదీసినందుకు కాంగ్రెస్ నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై కురుమయ్య ఫోన్‌లో శేఖర్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్ కురావాలని, లేకుంటే లాకప్‌డెత్ చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో భయాందోళనకు గురైన సదరు రైతు ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు ఎమ్మెల్యే, ఎస్సై, స్థానిక కాంగ్రెస్ నేతలు కారణమంటూ వాంగ్మూలం ఇచ్చాడు.

### న్యాయవాదిని బెదిరించిన ఎస్సై

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో సివిల్ పంచాయితీలో తలదూర్చినందుకు పోలీసులను న్యాయవాది సురేశ్‌గౌడ్ ప్రశ్నించారు. దీంతో స్థానిక ఎస్సై విజయ్ భాస్కర్ ఏకంగా అడ్వకేట్ అని కూడా చూడకుండా బెదిరించి, దుర్భాషలాడారు. దీన్ని నిరసిస్తూ గద్వాల జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ మూడు ఘటనలు పోలీసుల దాష్టికానికి నిదర్శనంగా మారాయి. శాంతిభద్రతలు అదుపు తప్పా వనడానికి ఉదాహరణగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఆర్టీసీ సిబ్బందికి ఆసుపత్రి

బిజినేపల్లి, జూన్ 14 : ఆర్టీసీ సిబ్బంది కోసం బిజినేపల్లి మండలం పాలెంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా దవాఖానను ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్‌ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం నూతనంగా ఉమ్మడి జిల్లాలో సిబ్బందికోసం ఏర్పాటు చేస్తున్న రెండో హెల్త్ సెంటర్‌ను ఆమె సందర్శించి పరిశీలించారు. జిల్లాలోని అన్ని డిపోల సిబ్బందితోపాటు వనపర్తి ఆర్టీసీ సిబ్బందికోసం ఈ దవాఖానను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, చారి పాల్గొన్నారు.



నూతన హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

## స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్వీపర్లు, ఏఐటీయూసీ నాయకులు

వనపర్తి, జూన్ 14 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు రెండు రకాల జీతాలు అమలుచేస్తూ శ్రమదోపిడికి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష ఆరోపించారు. స్వీపర్ల జీతాల్లో తేడాలను సరిచేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు తక్కువ వేతనాలిస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా అమలు చేయడం అమానుషమన్నారు. చాలీచాలని జీతాలతో స్వీపర్లు అత్యంత దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పార్ట్‌టైం నిబంధనలను తొలగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఏడీకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల యూనియన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఖాజాపాషా, రషీద్, ఖయ్యూం, గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

ఊర్కొండ, జూన్ 14 : ఓ మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని రాచాలపల్లిలో చోటు చేసేకున్నది. ఎస్సై వీరబాబు కథనం మేరకు రాచాలపల్లి గ్రామానికి వాడ్యాల స్వాతి ఈనెల 6న ఇంటి నుంచి జడ్చర్లలోని తన మేనమామ నాగరాజు ఇంటికి వెళ్లి వస్తానని భర్త వాడ్యాల సుదర్శన్‌కు చెప్పి వెల్లింది. కాగా స్వాతి తిరిగి రాకపోవడంతో సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమె ఆచూకీ తెలిస్తే 8712 657754 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

## టీచర్ అదృశ్యం

నాగర్‌కర్నూల్, జూన్ 14: స్కూల్ బస్సు డ్రైవర్‌తో టీచర్ పరారైన సంఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. వేసవి సెలవుల్లో ఈ ఘటన జరిగిందని, ఓ ప్రైవేట్ స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదే పాఠశాలలో పనిచేస్తున్న టీచర్‌తో ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం వాట్సాప్ గ్రూప్‌లో చక్కర్లు కొట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమి విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పెండ్లి పేరుతో వేధింపులు

- షీటీమ్‌ను ఆశ్రయించిన యువతి

బిజినేపల్లి, జూన్ 14: పెండ్లి పేరుతో ఓ యువతిని వేధిస్తున్న యువకుడిని షీటీమ్ పోలీసులు జైలుకు పంపిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. బిజినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెండ్లి చేసుకుంటానంటూ తరచూ వేధిస్తుండడంతో విసుగు చెందిన యువతి షీటీమ్‌ను ఆశ్రయించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకొని అదుపులోకి తీసుకొని జైలుకు తరలించారు.

## భవన నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

వనపర్తి, జూన్ 14 : మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణ చేపడుతున్న బహుళ అంతస్తుల భవనాలకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని, అలాగే దానికి తగ్గట్లుగా ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీ, ప్రధాన రోడ్డు మార్గంలో నిర్మాణమవుతున్న బహుళ అంతస్తుల భవనాలను శుక్రవారం కమిషనర్, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనిఖీలో రెండు భవనాల నిర్మాణ అసైన్‌మెంట్‌లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. నిర్మాణం పూర్తయిన వెంటనే దస్తావేజులు కార్యాలయంలో అందజేసి అసైన్‌మెంట్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీవో వరప్రసాద్, ఆర్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఇసుక డంపులు సీజ్

కొత్తకోట, జూన్14 : అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకు డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆర్ఐ పర్వతాలు, హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్ కథనం ప్రకారం కొత్తకోటలోని సివిల్ సప్లయర్స్ గోదాం వెనుక ఇసుక డంపు చేశారనే సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా పట్టణ కేంద్రానికి చెందిన పెచ్చన్నగారి కృష్ణారెడ్డి, రమేశ్ ఇసుకను డంపు చేసినట్లు నిర్ధారణ కావడంతో సీజ్ చేపినట్లు తెలిపారు. డంపు చేసిన ఇసుక 15ట్రాక్టర్ల వరకు ఉండవచ్చని ఆర్ఐ తెలిపారు. కాగాపై తెలిపిన వ్యక్తులు కొంతకాలంగా ఎద్దుల బండ్లతో ఇసుకను డంపు చేసి రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రాథమిక సమాచారం. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుని జైలు పంపుతామని ఎస్సై మంజునాథ్‌రెడ్డి హెచ్చరించారు.




## బాహుబలి ఐపీవోకి హ్యుందాయ్!

### సెబీకి దరఖాస్తు చేసుకునే యోచనలో సంస్థ

ముంబై, జూన్ 14: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్ ఇండియా. .స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమైనట్లు తెలుస్తున్నది. మెగా బాహుబలి ఐపీవోకి రావడానికి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకునే యోచనలో సంస్థ ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఐపీవో ద్వారా కనీసంగా 3 బిలియన్ డాలర్లు(రూ.25 వేల కోట్లు) నిధులను సేకరించాలని సంకల్పించింది. ఈ ఐపీవోకి సెబీ అనుమతిస్తే..దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీవో కానున్నది. ఇప్పటి వరకు ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీ సేకరించిన 2.7 బిలియన్ డాలర్లు అత్యధికం. అలాగే దేశీయ పారిశ్రామిక రంగంలో ఇదొక మైలురాయిలా నిలువనున్నదని, ముఖ్యంగా రెండు దశాబ్దాల తర్వాత ఐపీవోకి రాబోతున్న ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ కావడం విశేషం. ఈ ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 14 కోట్ల నుంచి 15 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించాలని హ్యుందాయ్ యోచిస్తున్నది.

### అయోనిక్5 కార్ల రీకాల్

ఇంటిగ్రేటెడ్ చార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో 1,744 యూనిట్ల అయోనిక్5 వాహనాలను రీకాల్ చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. జూలై 21, 2022 నుంచి ఏప్రిల్ 30, 2024లో తయారైన ఈ మాడళ్లలో 12వీ బ్యాటరీ డిచార్జి అవుతుండటమే ఇందుకు కారణమని వెల్లడించింది.


# కలవరపెడుతున్న వాణిజ్యలోటు

### గత నెలలో 23.78 బిలియన్ డాలర్లుగా నమోదు

న్యూఢిల్లీ, జూన్ 14: గత కొన్ని నెలలుగా రెండంకెల స్థాయిలో వృద్ధిని కనబరిచిన దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. గత నెలకుగాను దేశీయ ఎగుమతులు 9.1 శాతం వృద్ధితో 38.13 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇదే నెలలో దిగుమతులు 7.7 శాతం అధికమై 61.91 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఏడు నెలల గరిష్ఠ స్థాయి 23.78 బిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. అక్టోబర్ 2023లో నమోదైన 31.46 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చడం వల్లనే ఎగుమతుల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించాయి.

### ఆభరణాల ఎగుమతులు డౌన్

ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. మే నెలలో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతులు 4.95 శాతం తగ్గి రూ.20,713.37 కోట్లకు పరిమితమైనట్లు జెమ్ అండ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో రూ.21,795.65 కోట్లు(2,646.92 మిలియన్ డాలర్లు) విలువైన ఆభరణాలు ఎగుమతయ్యాయి. కానీ, బంగారు ఆభరణాల ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 13 శాతం ఎగబాకి రూ. 5,507.71 కోట్లకు చేరుకోగా, వెండి ఆభరణాల ఎగుమతులు కూడా రెండింతలు పెరిగి రూ.665 కోట్ల నుంచి రూ.1,103.72 కోట్లకు చేరాయని వెల్లడించింది.



> ఎగుమతులు గత నెలలో ఆశాజనక పనితీరు కనబరిచాయి. మిగతా నెలల్లో కూడా ఇదే ట్రెండ్‌ను కొనసాగించే అవకాశాలున్నాయి. వాణిజ్యలోటు కలవరపెడుతున్నప్పటికీ ప్రపంచ దేశాల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నది భారతే కావడంతో భవిష్యత్తులో దేశీయంగా డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయి. లోటు పెరిగిందని కలవరపడాల్సిన అవసరం లేదు.
>
> \- సునీల్ బర్థ్వాల్, వాణిజ్య శాఖ కార్యదర్శి

- **చమురు దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 28 శాతం పెరిగి 20 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏప్రిల్-మే మధ్యకాలంలో ఇవి 36.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.**
- **పసిడి దిగుమతులు 3.69 బిలియన్ డాలర్ల నుంచి 3.33 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.**
- **అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో ఎగుమతులు 5.1 శాతం పెరిగి 73.12 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 8.89 శాతం అధికమై 116 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్యలోటు 42.88 బిలియన్ డాలర్లు.**
- **సేవల ఎగుమతులు 26.99 బిలియన్ డాలర్ల నుంచి 30.16 బిలియన్ డాలర్లకు పెరిగాయి.**
- **ప్రధానంగా భారత్ నుంచి అమెరికా, నెదర్లాండ్స్, యూఏఈ, మలేషియా, బ్రిటన్ దేశాలకు వస్తువులు ఎగుమతి అవుతున్నాయి.**

**వాణిజ్య**

## ఐటీ అభివృద్ధికి హైసియా కార్యాచరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల అభివృద్ధే లక్ష్యంగా హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్(హైసియా) ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఇటీవల కొత్తగా ఏర్పాటైన హైసియా మేనేజ్‌మెంట్ కమిటీ నాలుగు ప్రధాన అంశాలతో రెండేండ్ల కాలానికి సంబంధించిన ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను ప్రకటించింది. మెంటర్ ఎంగేజ్‌మెంట్, ఫ్యూచర్ రెడినెస్, థాట్ లీడర్‌షిప్, గవర్నమెంట్ రిలేషన్స్ అండ్ పాలసీ అంశాలతో వ్యూహాత్మక విజన్ 2024-26ను రూపొందించింది. మెంబర్ ఎంగేజ్‌మెంట్‌లో భాగంగా ఐటీ కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విద్య, పర్యావరణం, ఆరోగ్య విభాగాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా స్టార్టప్‌లను ప్రోత్సహించడం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచేలా చర్యలు తీసుకోవడం, ఐటీ పరిశ్రమకు అవసరమైన అంశాలపై ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చించడం వంటి అంశాలు ప్రధాన అజెండాగా హైసియా ఈ కార్యాచరణను రూపొందించింది.

## టీ హబ్‌లో మొబిలిటీ చాలెంజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీతో కలిసి టీ హబ్.. మొబిలిటీ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నది. ఆటోమొబైల్ రంగంలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించడంతో పాటు ఎంపిక చేసిన స్టార్టప్‌లకు మార్కెట్‌పై అవగాహన కల్పించడం, వ్యాపార, వాణిజ్య ప్రణాళికలను మెరుగుపర్చి మార్కెట్‌లోకి వెళ్లేందుకు సిద్ధం చేసేలా ఇంక్యుబేటర్‌తో సహాయ సహకారాలను అందించనున్నారు. ప్రధానంగా అత్యాధునిక టెక్నాలజీలైన వీడియో ఎనలిటిక్స్, కృత్రిమ మేధస్సు, ఎంఎల్, డాటాఎనలిటిక్స్‌లో స్టార్టప్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఈ లింకు ( https://bit.ly/3xjuO8B) దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## బాబోయ్.. ఆర్థిక మోసాలు

- సగం మంది భారతీయులు నష్టపోయినవారే
- లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి

ముంబై, జూన్ 14: గడిచిన మూడు సంవత్సరాల్లో 47 శాతం మంది భారతీయులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆర్థిక మోసాల బారినపడ్డారని శుక్రవారం విడుదలైన ఓ సర్వే తెలియజేసింది. యూపీఐ, క్రెడిట్ కార్డ్ మోసాలే అధికంగా జరిగాయని పేర్కొన్నది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల నుంచి 23,000 మంది అభిప్రాయాలతో లోకల్‌సర్కిల్స్ ఈ సర్వేను చేపట్టింది. వీరిలో సగం మందికిపైగా తమ క్రెడిట్ కార్డులపై దేశ, విదేశీ వ్యాపారులు/వెబ్‌సైట్లు అనధికారిక చార్జీలను వేసినట్టు చెప్పారని వెల్లడించింది. ఇక సర్వేలో పాల్గొన్నవారిలో 43 శాతం మంది తాము లేదా తమ కుటుంబ సభ్యులు క్రెడిట్ కార్డ్ లావాదేవీల్లో మోసపోయామని, 36 శాతం మంది యూపీఐ లావాదేవీల్లో నష్టపోయామన్నారు.






## సూచీలు ఆల్‌టైమ్ హై

ముంబై, జూన్ 14: తీవ్ర ఒడుదొడుకుల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త స్థాయిలను అధిరోహించాయి. శుక్రవారం ఉదయం నష్టాల్లో ట్రేడైనా.. ఆఖర్లో మాత్రం లాభాలనే అందుకున్నాయి. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 181.87 పాయింట్లు లేదా 0.24 శాతం పెరిగి 77వేలకు సమీపంలో మునుపెన్నడూ లేనివిధంగా 76,992.77 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో 77,081.30 స్థాయిని తాకింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ కూడా 66.70 పాయింట్లు లేదా 0.29 శాతం అందిపుచ్చుకొని క్రితమెన్నడూ లేనట్టుగా 23,465.60 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 23,490.40 స్థాయిదాకా వెళ్లింది. కాగా, ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 299.41 పాయింట్లు, నిఫ్టీ 175.45 పాయింట్లు పుంజుకున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ తదితర షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి.

### రూ.435 లక్షల కోట్ల సమీపానికి..

బీఎస్‌ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ ఆల్‌టైమ్ హైని తాకుతూ శుక్రవారం రూ.435 లక్షల కోట్లను సమీపించింది. తొలిసారి రూ.4,34, 88,147.51 కోట్ల వద్ద స్థిరపడింది. గత మూడు రోజుల్లోనే రూ.7.93 లక్షల కోట్లు పెరగడం గమనార్హం. ఎన్‌ఎస్‌ఈలోని మదుపరుల సంపద కూడా రికార్డు స్థాయిల్లోనే కదలాడుతున్నది.

### అంబుజాకు పెన్నా కిక్కు

పెన్నా సిమెంట్‌ను కొన్న నేపథ్యంలో అంబుజా సిమెంట్ షేర్ల విలువ బీఎస్‌ఈలో 1.90 శాతం, ఎన్‌ఎస్‌ఈలో 1.36 శాతం చొప్పున పెరిగింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,115.85 కోట్లు ఎగిసి బీఎస్‌ఈలో రూ.1,66,741.14 కోట్లకు చేరింది.

## 'రిటైల్ ఇన్వెస్టర్లకు ఈక్విటీలే మేలు'

న్యూఢిల్లీ, జూన్ 14: రిటైల్ ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్ మార్గంలో ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులే ఉత్తమమని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) చీఫ్ ఆశిశ్‌కుమార్ చౌహాన్ సూచించారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్, అంతకుముందు క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చీఫ్ మదాబీ పురి బచ్.. రిటైల్ ఇన్వెస్టర్లకు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్ రిస్క్‌తో కూడుకున్నదని చేసిన ప్రకటనల నేపథ్యంలో చౌహాన్ కూడా పైవిధంగా స్పందించారు. 'ఎఫ్అండ్‌వో ట్రేడింగ్‌కు రిటైల్ మదుపరులు దూరంగా ఉండాలి. అందులో ఉన్న రిస్క్‌పై అవగాహన ఉన్నవారే, నష్టాలు వాటిల్లితే భరించేవారే ఆ ట్రేడింగ్‌కు వెళ్లాలి' అని ఎన్‌ఎస్‌ఈ ఎండీ, సీఈవో చౌహాన్ శుక్రవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో చెప్పారు. కాగా, లాభాలు, ట్రేడింగ్ వాల్యూమ్స్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో అంతా ఎఫ్అండ్‌వో ట్రేడింగ్‌పైనే దృష్టి పెడుతున్నారు. అయితే రిస్క్ ఎక్కువని నిపుణులు సూచిస్తున్నా రిటైల్ ఇన్వెస్టర్లు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎఫ్అండ్‌వోల్లో పెట్టుబడులు పెట్టిన వ్యక్తిగత ట్రేడర్లలో 89 శాతం నష్టపోయారని సెబీ చెప్తున్నది. 2021-22లో నష్టాల సగటు రూ.1.1 లక్షలుగా ఉన్నట్టు పేర్కొన్నది. 2018-19తో పోల్చితే 2020-21 నాటికి ఎఫ్అండ్‌వోల్లో ఇండివీడ్యువల్ ట్రేడర్ల సంఖ్య 7.1 లక్షల నుంచి ఏకంగా 45.24 లక్షలకు పెరిగింది. ఇక ఈ ఏడాది మార్చిలో ఎఫ్అండ్‌వో నెలవారీ టర్నోవర్ రూ.8,740 లక్షల కోట్లుగా నమోదైంది. 2019 మార్చిలో ఇది కేవలం రూ.217 లక్షల కోట్లే. అలాగే ఈక్విటీల్లో రోజువారీ టర్నోవర్ సగటున లక్ష కోట్ల రూపాయలే. ఎఫ్అండ్‌వోల్లో మాత్రం ఇది దాదాపు రూ.330 లక్షల కోట్లుగా ఉంటున్నది.



## బొగ్గు గనుల వేలం వచ్చేవారం

న్యూఢిల్లీ, జూన్ 14: వచ్చేవారంలో పదోసారి బొగ్గు గనులను వేలం వేయబోతున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే 62 గనులను గుర్తించినట్లు, ఈ గనుల వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చునని ఆయన చెప్పారు. 2020లో ప్రారంభమైన బొగ్గు గనుల వేలంలో ఇప్పటి వరకు 256 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్న 107 బ్లాక్‌లను విక్రయించింది.

## ఇప్పటికైతే ఆరోగ్య బీమా లేదు: ఎల్ఐసీ

న్యూఢిల్లీ, జూన్ 14: ఆరోగ్య బీమా రంగంలోకి అడుగుపెట్టే అధికారిక ప్రతిపాదనేదీ లేదని ఎల్ఐసీ శుక్రవారం స్పష్టం చేసింది. 'ఆ రకమైన ప్రతిపాదనైతే ఇప్పటికైతే అధికారికంగా రాలేదు' అని హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఎంట్రీపై ఎల్ఐసీ తేల్చిచెప్పింది. ప్రస్తుతం జీవిత బీమా సంస్థలు ఆరోగ్య బీమా పాలసీలను ఇవ్వరాదు. వాటిని జనరల్ ఇన్సూరెన్స్, స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలే అందిస్తున్నాయి. బీమా చట్టం 1938, ఐఆర్డీఏఐ నిబంధనల ప్రకారం కూడా ఒకే సంస్థ.. లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్‌లను అమ్మరాదు. అందుకే ఆరోగ్య బీమా పాలసీలను జారీ చేసేందుకు ఎల్ఐసీకి అనుమతి లేదు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకే సంస్థ జీవిత, సాధారణ, ఆరోగ్య బీమాలను అమ్ముకునేలా లైసెన్స్‌లు ఇవ్వాలని, ఆ మేరకు సంబంధిత చట్టాలను సవరించాలని బీజేపీ నేత జయంత్ సిన్హా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సూచించింది. దీని వల్ల దేశంలో బీమా అందరికీ చేరువవుతుందని అభిప్రాయపడింది.